క్లుప్తంగా

యూడైస్‌లో నమోదు పూర్తిచేయండి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

రాయికోడ్(అందోల్): మండలంలోని 48 ప్రభుత్వ, నాలుగు ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలను యూడైస్ ఫారంలో నమోదును పూర్తి చేయాలని మండల విద్యాధికారి ఎస్.శ్రీనివాస్ సూచించారు. రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించి యూడైస్‌లో వివరాలు నమోదు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ వివరాల ఆధారంగానే పాఠశాలలకు నిధులు, ఇతర సౌకర్యాలు, వసతులు సమకూర్చుతారని చెప్పారు. సందేహాలుంటే ఎంఐఎస్‌ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు



శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఫత్తేపూర్‌లో సిర్గాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ ప్రతిభ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు జరిపారు. జ్వరం, దగ్గు, జలుబు, ఇతర కారణాలతో బాధపడుతున్న రోగులకు వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ ప్రతిభ తెలిపారు. ఎంపీడీఓ రమేశ్‌బాబు, ఎంపీఓ శ్రీనివాస్ వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది రాంచెందర్, స్వరూప, హేమలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



సంగారెడ్డి టౌన్ : యువతి అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి పట్టణంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రామచంద్రపురానికి చెందిన రాజు కూతురు ప్రణీత ఈ నెల 10వ తేదీన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బంధువులను చూడడానికి తల్లిదండ్రులతో వచ్చారు. బంధువులతో కలిసి భోజనం చేసి చేతులు కడుక్కోవడానికి వెళ్లి ఎంతసేపటికి రాలేదు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ లభించిన వారు 8712656718, 08455276333 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి..



సంగారెడ్డి టౌన్ : అప్పుల బాధతో వ్యక్తి అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. రాంనగర్‌కు చెందిన నరేష్ (30) ఎస్‌ఎస్‌డీఏ డ్యాన్స్ స్కూల్‌లో పిల్లలకు నృత్యాలు నేర్పిస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని అప్పులు కావడంతో గురువారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయి తాను చనిపోతున్నానని స్నేహితుడు శ్రీనివాస్‌కు వాట్సాప్ మెసేజ్ చేశాడు. నరేష్ భార్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరామర్శ

పటాన్‌చెరు: మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి గురువారం పరామర్శించారు. లక్ష్మారెడ్డి సతీమణి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పురస్కారాలు

వట్‌పల్లి(అందోల్): ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని 9మండలాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార ప్రదానోత్సవాన్ని శుక్రవారం సంగుపేట వద్ద గల లక్ష్మీదేవి గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, కలెక్టర్ క్రాంతి వల్లూరి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల సర్వే

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యూలరైజేషన్ స్కీం) 2020లో దరఖాస్తులు చేసుకున్న పాట్లను గురువారం సర్వే చేశామని ఎంపీఓ శరత్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చిట్కుల్‌కు చెందిన కమ్మరి వాణి, విట్ట సత్యనారాయణ గ్రామ శివారులో తమకున్న భూమిలో 2020 లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.







అడుగుకో గుంత.. వాహనదారుల చింత

వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు కంది మీదుగా బెంగుళూర్ వెళ్లే బైపాస్ రోడ్డు గుంతమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి గుంతల్లో పడుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు తిరుగుతుంటాయి. దీంతో ఈ గుంతలు మరింత పెద్దగా అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

రహదారులన్నీ ఛిద్రం

● ప్రయాణికులకు తప్పనితిప్పలు



గుంతలు పడి అధ్వానంగా మారిన అల్లనా–బీదర్ రోడ్డు

జహీరాబాద్ టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జహీరాబాద్ నియోజకవర్గంలోని రహదారులన్నీ దెబ్బతిన్నాయి. రోడ్లపై గుంతలు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ప్రధాన రహదారులపై వెళ్లేందుకు వాహన చోదకులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గుంతల కారణంగా ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. బైపాస్ రోడ్డు నుంచి అల్లనా గుండా బీదర్ వైపు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది.

భారీ వర్షాలతో..

వానకాలం ప్రారంభానికి ముందు బాగున్న రోడ్డు భారీ వర్షాలకు దెబ్బతిని గుంతలు పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జహీరాబాద్–బీదర్ ప్రధాన రహదారి కూడా చాలా చోట్ల అధ్వానంగా మారింది. మండలంలోని కొత్తూర్(బి) నుంచి కర్నాటక సరిహద్దు లో రోడ్డు ఘోరంగా తయారైంది. నారింజ బ్రిడ్జి వద్ద రోడ్డు ఇరుకుగా ఉంది. అక్కడే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డు నేషనల్ హైవే అథారిటీకి బదలాయించడంతో సంబంధిత శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయడం లేదు. వర్షాలకు జహీరాబాద్– శేఖాపూర్ రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రోడ్డు గుండా ప్రయాణించే వారు భయపడుతున్నారు.

ఎమ్మెల్యేకు వినతి..

శేఖాపూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే మాణిక్‌రావును కలిసి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు. మండలంలోని బూచినెల్లి, అల్గోల్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. జహీరాబాద్ పట్టణంలోని రోడ్లు కూడా భారీ వర్షాలకు దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతున్నది. జిల్లా స్థాయి అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

చెత్త వేయకుండా చర్యలు తీసుకోండి



మురికి కాల్వల పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ సత్తయ్య

కంగ్టి(నారాయణఖేడ్): గ్రామాల్లోని మురికి కాల్వల్లో ప్రజలు చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. మండలంలోని తుర్కవడ్‌గాం గ్రామంలో గురువారం ఆయన పర్యవేక్షణలో మురికి కాల్వల పూడిక, చెత్త తొలగింపు నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీలు గ్రామాల్లోని మురికి కాల్వల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వ్యక్తి బైండోవర్



దశరథ్‌ను బైండోవర్ చేస్తున్న పోలీసులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ఓ మందుబాబు ఎమర్జెన్సీ నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులను విసుగెత్తించాడు. శాంతినగర్‌కు చెందిన గొల్ల దశరథ్(42) మద్యం సేవించి బుధవారం అర్ధరాత్రి డయల్ 100 నంబర్‌కు పలుమార్లు ఫోన్ చేశాడు. వినాయక మండపం నుంచి ఫోన్ చేశాడు. సమయాన్ని వృథా చేయడంతో న్యూసెన్స్ కింద గురువారం అతడిని అరెస్టు చేసి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్, తహసీల్దార్ రవీందర్ ముందు బైండోవర్ చేశారు. మరో సారి డయల్ 100కు ఫోన్ చేసి విసిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.ఈ సందర్భంగా జహీరాబాద్ టౌన్ ఎస్‌ఐ. కాశీనాథ్ మాట్లాడుతూ డయల్ 100 నంబర్‌కు ఫేక్ కాల్స్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొనసాగిన ఆందోళన

హత్నూర(సంగారెడ్డి): సమస్యల పరిష్కారం కోసం మూడు రోజుల నుంచి బోర్పట్ల గ్రామ శివారులోని పరిశ్రమ వద్ద ఆందోళన గురువారం కూడా కొనసాగింది. అయితే గురువారం సాయంత్రం పరిశ్రమ ప్రతినిధులు చర్చలు జరిపి హామీల అమలు కోసం కృషి చేస్తామన్నారని కార్మికులు తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, నాయకుడు కమలాకర్ తదితరులు ఉన్నారు.

గణనాథుడిని ప్రత్యేక పూజలు



నారాయణఖేడ్: పూజలు చేస్తున్న డీఎస్పీ



జహీరాబాద్: సాయిరాం కాలనీలో పూజలు



న్యాల్‌కల్(జహీరాబాద్): మిర్జాపూర్(ఎన్)లో స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సదాశివపేట(సంగారెడ్డి): నవశక్తియూత్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం

ధరణి సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నారాయణఖేడ్: ధరణిలో భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖేడ్ డివిజన్ పరిధిలో భూ సమస్యలు పరిష్కారం కాకుండా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న తహసీల్దార్లు రిజెక్ట్ చేస్తున్నారన్నారు. 161బీ జాతీయరహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. సదస్సు నిర్వహించి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సంతోష్, సతీశ్, ప్రజాసంఘాల నాయకులు బస్వరాజ్‌పాటిల్, మహిపాల్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

నగదురహిత చెల్లింపులపై అవగాహన



మాట్లాడుతున్న ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సహకారంతో నగదు రహిత చెల్లింపులపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ సంగారెడ్డి మేనేజర్ వెంకటరావు, డాక్టర్ సదయకుమార్, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ జోష్నా పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

● ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ప్రభుత్వ పాఠశాల గురుపూజోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొని వస్తున్నట్లు తెలిపారు. 25 సంవత్సరాలుగా ఏటా గురుపూజోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసి, ఉత్తమ గురువులను సన్మానించడం సంతోషకరంగా ఉందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు బోధించాలని, క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు పీపీ రాథోడ్, జెమిని కుమారి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘననివాళులు





సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఖేడ్ సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమెల మాణిక్, ఖేడ్ బాధ్యులు రమేశ్, అరుణ్, సతీష్, మహిపాల్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు కాన్షీరాం, తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: మార్క్సిస్టు మహాయోధుడు సీతారాం ఏచూరి మృతి బాధాకరం అని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య అన్నారు. గురువారం పాశమైలారంలోని పారిశ్రామికవాడలో గల పార్లే ఆగ్రో పరిశ్రమలో నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. సీతారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో ఒక ఆదర్శ నేతను కోల్పోయాం అన్నారు. విద్యార్థి దశ నుంచే పోరాటాల్లో పాల్గొన్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ సంతోష్ కుమార్‌గౌడ్, నాయకులు రాజశేఖర్, సుజిత్, కిరణ్, రాజు, శ్రీకాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తపస్ నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు తపస్ (తెలంగాణ ఉపాధ్యాయ సంఘం) ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి తుకారం అన్నారు. గురువారం మండల పరిధిలోని మిర్జాపూర్(బి), హద్నూర్, న్యాల్‌కల్, చీకూర్తి, వడ్డి, మామిడ్గి తదితర పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు శేఖర్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కోషాధికారి సంజీవ్, సభ్యులు శ్రీకాంత్, రాజునాయక్, కృష్ణ, బాలక్రిష్ణ, సోమశేఖర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పరిశుభ్రతపై కళాకారుల అవగాహన**

నారాయణఖేడ్: కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ 8వ వార్డుకు సంబంధించిన మన్సూర్‌పూర్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారులు శేఖర్ గౌడ్, మదన్, రవీందర్, సాయిలు, రాజు, ఆగమయ్య, శశిప్రియలు దోమల వల్ల వచ్చే వ్యాధులు, విషజ్వరాలు, ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్పరిణాలను పాటల రూపంలో వివరించారు.

◆ **ఎంపీడీఓకు సన్మానం**

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన డీ.రమేశ్ బాబును మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఉప్పరి అంజయ్య, మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

◆ **అంబులెన్స్ ఏర్పాటు చేయాలి**

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో ప్రజలకు అందుబాటులో 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు అరుణ్‌రాజ్ శేరికార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం విలేకరులతో మాట్లడుతూ.. మండల ప్రజలకు అత్యవసర సమయంలో అంబులెన్స్ లేక ఇబ్బందులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ అంబులెన్స్‌కు డబ్బులు పెట్టలేక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు.

◆ **రోడ్లకు మరమ్మతులు చేయండి**

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలో అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఖేడ్ తాజా మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్ విజ్ఞప్తి చేశారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. రాజీవ్ చౌక్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు, బసవేశ్వర చౌక్, శివాజీ చౌక్ సమీపాల్లో రోడ్లు గోతులమయమై పూర్తిగా అధ్వానంగా మారాయన్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు.

◆ **విద్యార్థుల శ్రమదానం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ.. శ్రమదానంతో విద్యార్థుల్లో మరింత క్రమశిక్షణ, శ్రమ విలువ పెరుగుతుందన్నారు. పర్యావరణంపై సైతం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

◆ **వినాయక విగ్రహాల నిమజ్జనం**

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో గురువారం వినాయక విగ్రహాల నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రాజారాతండా, బాన్సువాడ, ముకుంద తండా, చాప్టా, దామర్‌గిద్దా తదితర గ్రామాల్లో వినాయకులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాగుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. అలాగే, ముకుందతండాలో వినాయకుడి నిమజ్జనోత్సవంలో భాగంగా యువకులు డీజే సౌండ్ పెట్టారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్, ఏఎస్‌ఐ నారాయణ వెళ్లి డీజేను సీజ్ చేసి, యజమాని రాథోడ్ సునీల్‌పై కేసు నమోదు చేశారు

◆ **బ్లాక్ మెయిలర్ రిమాండ్**

పటాన్‌చెరుటౌన్: ప్రభుత్వ స్థలంలో అనుమతులకు మించి నిర్మాణాలు చేపడుతున్నారని, ఓ వ్యక్తిని భయభ్రాంతులకు గురిచేసి రూ.5 లక్షలు డిమాండ్ చేసిన కేసులో ఓ విలేకరిని రిమాండ్‌కి తరలించారు. అమీన్‌పూర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... బీరంగూడ జయలక్ష్మినగర్ కాలనీకి చెందిన జన్వాడే రవి సీబీఆర్ కాలనీలో ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. రామచంద్రాపురం సాయినగర్ కాలనీకి చెందిన పీడీఎఫ్ మన వార్త విలేకరి రాము ప్రభుత్వ స్థలంతో పాటు అనుమతులకు మించి నిర్మాణాలు చేపడుతున్నారని.. అధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. హైడ్రా కమిషనర్ తనకు బాగా తెలుసని, రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కి తరలించారు.

◆ **యువకుడు అదృశ్యం**



రామచంద్రాపురం(పటాన్‌చెరు) : యువకుడు అదృశ్యమైన ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ నేతాజీనగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్ కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఎర్రగడ్డ ఆస్పత్రిలో చూయించుకొని మందులు వాడుతున్నాడు. 7వ తేదీ రాత్రి తల్లితో కలిసి భోజనం చేసిన శ్రీకాంత్ మధ్య రాత్రి ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. 10 తేదీన తల్లికి ఫోన్ చేసి తాను తిరుపతికి వచ్చినట్లు తెలిపాడు. తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మాట్లాడి రెండ్రోలు అయినా ఇంటికి రాకపోవడంతో తల్లి చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ **15న కిషన్‌రావు సంతాప సభ**

పటాన్‌చెరు: కాలుష్యంపై పోరాడిన పర్యావరణ వేత్త కిషన్‌రావు సంతాప సభను పటాన్‌చెరు గ్రేటర్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా సంతాపసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

◆ **తల్లీ, కుమారుడు అదృశ్యం**



పటాన్‌చెరు టౌన్: తల్లీ కుమారుడు అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండలంలోని పటేల్‌గూడ బీఎస్‌ఆర్ కాలనీకి చెందిన స్వాతి ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తుంది. ఈనెల 11వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో తన కుమారుడు సంభూద్ (3)ని తీసుకొని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోదరి అదృశ్యంపై అక్క పల్లవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **చికిత్స పొందుతూ యువకుని మృతి**

సంగారెడ్డి : వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడని పట్టణంలోని పద్మావతి న్యూరో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఎదుట గురువారం ఆందోళన చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కంది మండలం ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన బోల్లారం రమేష్(30) అనారోగ్యానికి గురికావడంతో ఈనెల 8న ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పోందుతూ గురువారం అతను మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే రమేష్ మృతి చెందాడని, అతని కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగారు. రమేష్ అసుపత్రిలో చేరినప్పటి నుంచి సీసీ పుటేజీలు కుటుంబ సభ్యులకు చూపించడంతో వారు ఆందోళన విరమించారని సీఐ భాస్కర్ వివరించారు.